

అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: నిత్యాన్నదాన పథకానికి శనివారం నంద్యాలకు చెందిన ఏరాసు సుబ్బారెడ్డి రూ.లక్ష విరాళాన్ని పర్యవేక్షణకులు మధుసూదన్ రెడ్డికి అందజేశారు.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళారాధన వేదికపై శనివారం హైదరాబాద్‌కు చెందిన అనన్యరెడ్డి బృందం వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



మహానందిలో భక్తుల సందడి

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చినవారు కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

లైంగిక వేధింపులపై ఫిర్యాదుకు కమిటీలు

- జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి పీ వెంకటలక్షుమ్మ



జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న పీడీ, సిబ్బంది

కర్నూలు(అర్బన్): మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి పీ వెంకటలక్షుమ్మ చెప్పారు. ఇందుకు సంబంధించిన వివరాలను తమ శాఖ డైరెక్టర్ బీ రవిప్రకాష్‌రెడ్డి శనివారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి స్పష్టంగా తెలియజేశారన్నారు. లైంగిక వేధింపుల చట్టం 2018 ప్రకారం పది మంది కంటే ఎక్కువ ఉద్యోగులు పనిచేస్తున్న ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు ఆర్గనైజేషన్లలో అంతర్గత కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే జిల్లా స్థాయిలో లోకల్ కంప్లైంట్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీకి చైర్ పర్సన్‌గా డాక్టర్ మాధవీశ్యామల నియమితులయ్యారన్నారు. ఈ కమిటీలో ఒక పోలీసు అధికారి, ఒక న్యాయవాదితో పాటు ఇద్దరు ఎన్‌జీఓలు మెంబర్లుగా, ఐసీడీఎస్ పీడీ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారన్నారు. ఆయా సంస్థల్లో పనిచేసే మహిళా ఉద్యోగులు తమ ఫిర్యాదులను అంతర్గత కమిటీలకు అందజేయవచ్చన్నారు. అంతర్గత కమిటీలు లేని సంస్థల్లో నేరుగా జిల్లా కమిటీకి ఫిర్యాదు చేయవచ్చన్నారు. లైంగిక వేధింపుల చట్టం గురించి మహిళా ఉద్యోగులు తెలుసుకోవాలని, తాము పని చేస్తున్న కార్యాలయాల్లో వేధింపులకు గురైతే వెంటనే ఆయా కమిటీలకు ఫిర్యాదు చేయాలన్నారు.

కర్నూలు డీసీసీబీకి రూ.1.68 కోట్ల నికర లాభం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు 2023–24 సంవత్సరానికి రూ.1.68 కోట్ల నికర లాభం వచ్చింది. గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన లావాదేవీలపై ఆడిట్ పూర్తి కావడంతో కర్నూలు డీసీసీబీ బ్యాలెన్స్ షీట్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా శనివారం డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి విజయకుమార్ విలేకర్లతో మాట్లాడుతూ 2023–24 సంవత్సరం ముగింపు నాటికి డీసీసీబీ టర్నోవర్ రూ.3,920 కోట్లకు చేరిందన్నారు. ఇందులో డిపాజిట్లు రూ.750 కోట్లు ఉండగా.. అడ్వాన్స్‌లు రూ.3,170 కోట్లు ఉన్నాయన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ప్యాపిలి మండలం నేరెడుచెర్ల, డోన్ మండలం ఎద్దుపెంటలో నూతన బ్రాంచీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలోని గోస్పాడు మండలం యాళ్లూరు, బనగానపల్లి మండలం నందవరం, మండల కేంద్రమైన కొలిమిగుండ్లలో నూతన బ్రాంచీలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

టీచ్ టూల్‌పై 1 నుంచి శిక్షణ

కర్నూలు సిటీ: జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు జూలై 1 నుంచి 10వ తేదీ వరకు టీచ్ టూల్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈఓ కె. శామ్యూల్ తెలిపారు. శనివారం డీఈఓ తన చాంబర్లో టీచ్ టూల్‌పై మాస్టర్ ట్రైనర్స్, కోర్సు కో–ఆర్డినేటర్స్‌తో శిక్షణకు సంబంధించిన ప్రణాళికపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ టీచ్ టూల్‌పై జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో శిక్షణ జరుగుతుందన్నారు. ఆదోనిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, పత్తికొండలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ఎమ్మిగనూరులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, పెద్దపాడు(కల్లూరు మండలం)లలో శిక్షణ ఉంటుందన్నారు. ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని, మొత్తం 492 మంది టీచర్లు ఇందులో పాల్గొంటారన్నారు. శిక్షణకు గైర్హాజరు అయితే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు.

లాఠీ విడిచిన నాలుగో సింహం!

బదిలీల ధ్యాస.. సొంత పనులు

- జిల్లా వ్యాప్తంగా రెచ్చిపోతున్న దొంగలు
- అడ్డూఅదుపు లేని సైబర్ నేరగాళ్లు
- యథేచ్ఛగా వాహన చోరీలు
- నిందితుల ఆచూకీ గుర్తించడంలో వైఫల్యం
- రికవరీలు కూడా అంతంత మాత్రమే

కర్నూలు: జిల్లాలో పోలీసింగ్ దారి తప్పుతోంది. కొంతకాలంగా ప్రజల భద్రత గాలిలో దీపంలా మారింది. పట్టపగలే దొంగతనాలు జరుగుతున్నా పోలీసులు కనీస చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత మూడు నాలుగు నెలలుగా పోలీసులు ఎన్నికల విధుల్లో ఉండటం, క్షేత్రస్థాయిలో జరుగుతున్న నేరాలపై ఉన్నతాధికారులకు నియంత్రణ లేకపోవడంతోనే ఇటీవల కాలంలో నేరాలు, దొంగతనాలు అధికమయ్యాయి. పోలీస్ స్టేషన్లకు సమీప కాలనీల్లోనే దొంగలు రెక్కీ నిర్వహించి ప్రజల సొమ్మును కొల్లగొడుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా చోరీలు జరుగుతున్నా దొంగలను పట్టుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే భావన పెరుగుతోంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు పగటి దొంగతనాలు 96, రాత్రి దొంగతనాలు 89, సాధారణ దొంగతనాలు 298 జరగ్గా.. రూ.4.79 కోట్ల విలువ చేసే సొమ్ము దొంగల పాలయ్యింది. అలాగే 146 వాహన దొంగతనాలు జరిగాయి. 251 సైబర్ మోసాలు, 186 చైన్ స్నాచింగ్ సంఘటనలు చోటు చేసుకున్నాయి. వీటిలో సగానికి పైగా కేసులు గత మూడు నెలల కాలంలోనే ఉండటం పోలీసు నిఘా వైఫల్యానికి నిదర్శనంగా నిలుస్తోంది.

సగటున 5 నుంచి 10 కేసులు నమోదు


జిల్లాలో నిత్యం సగటున 5 నుంచి 10 వరకు చోరీ కేసులు నమోదవుతున్నాయి. కష్టపడి సంపాదించుకున్నదంతా పోగొట్టుకున్న ఎంతోమంది బాధితులు తేరుకోలేకపోతున్నారు. చోరీ కేసుల్లో నిందితులు కొందరు ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల వారు కాగా.. మరికొందరు స్థానికులు, అంతర్ జిల్లా దొంగలు ఉంటున్నారు. దొంగతనం జరిగిన తీరును బట్టి అది ఏ ముఠానో నిర్ధారించే పోలీసులు గతంలో క్రైం పార్టీ విధులు నిర్వహించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కేవలం కొందరు అధికారుల సొంత పనులు, ఆదాయ వనరులు సమకూర్చడమే క్రైం పార్టీ సిబ్బంది విధులుగా మారిపోయాయనే అపవాదు ఉంది. దొంగతనాల నియంత్రణతో పాటు ఇసుక, గ్రావెల్ తదితర అక్రమ రవాణాపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి పోలీసు అధికారులు సిబ్బందిని అప్రమత్తం చేసే నిఘా వ్యవస్థ (స్పెషల్ బ్రాంచ్) కొంతకాలంగా నిద్రావస్థలోకి జారుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రజల సొత్తుకు భరోసా కరువు

రూపాయి రూపాయి కూడబెట్టి సంపాదించుకున్న ప్రజల సొత్తుకు భరోసా కరువైంది. తాళం వేసిన ఇళ్లలోని సొత్తుతో పాటు మహిళల మెడలోని బంగారు గొలుసులకు అమాంతం రెక్కలొస్తున్నాయి. గుర్తు తెలియని యువకులు ద్విచక్ర వాహనాలపై వచ్చి ఒంటరిగా ఉన్న మహిళల మెడలోని చైన్‌లు, మంగళసూత్రాలు తెంచుకుపోతున్నారు. వీధుల్లోనే కాదు.. దుకాణాలు, ఇళ్లల్లో ఉన్న మహిళల బంగారు గొలుసులకు రక్షణ లేకుండాపోతోంది.



కర్నూలులో ఇటీవల చోరీ జరిగిన ఇంట్లో చెల్లాచెదురుగా పడిన సామగ్రి



జిల్లాలో ఆరు మాసాల్లో 186 చైన్ స్నాచింగ్ ఘటనలు చోటు చేసుకోగా కర్నూలు నగరంలోనే రెండు నెలల వ్యవధిలో 11 చైన్ స్నాచింగ్‌లు చోటు చేసుకోవడం గమనార్హం.

- ఇక జిల్లాలో దొంగలు వరుస చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాలు విసురుతున్నారు. మూడు నెలల వ్యవధిలో సుమారు రూ.2 కోట్లకు పైగా ప్రజల సొమ్ము లూటీ చేశారు.

కనిపించని విజిబుల్ పోలీసింగ్

పోలీసులు నిరంతరం ప్రజల్లో కనిపించాలి, స్టేషన్లకు పరిమితం కావొద్దని పోలీసు ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం విజిబుల్ పోలీసింగ్ లేకుండాపోయింది. నిత్యం బందోబస్తు విధులతో విజిబుల్ పోలీసింగ్ సవాలుగా మారిందని పోలీసులు చెబుతుండగా.. నిఘా వైఫల్యంతోనే చోరీలు జరుగుతున్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారి మొదలు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి వరకు ఎక్కువ సమయం కార్యాలయాలు, స్టేషన్లలో గడుపుతుండటంతోనే దొంగలు రెచ్చిపోతున్నారని తెలుస్తోంది.

జిల్లా కేంద్రం కర్నూలు పరిధిలో నెలకు కనీసం 15 నుంచి 20 దొంగతనం కేసులు నమోదవుతున్నాయి. కష్టపడి సంపాదించుకున్నదంతా పోగొట్టుకుంటున్న బాధితులు లబోదిబోమంటున్నారు.

- సైబర్ మోసాలు కూడా భారీగానే నమోదవుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఆరు మాసాల వ్యవధిలో 251 సైబర్ నేరాలకు సంబంధించిన ఘటనలు చోటు చేసుకున్నాయి. దాదాపు రెండేళ్ల నుంచి ఇలాంటి కేసుల దర్యాప్తు పెండింగ్‌లో ఉంటున్నాయి. 2020 సంవత్సరం డిసెంబర్‌లో కలెక్టర్ వీరపాండ్యన్ పేరుతో నకిలీ మెయిల్ ఐడీ తెచ్చి కిందిస్థాయి ఉద్యోగులకు మెసేజ్‌లు పంపి డబ్బులు సర్దుబాటు చేయాలని మోసానికి పాల్పడిన ఘటన జరిగి మూడేళ్లు గడచినా నేరస్తుని ఆచూకీ లభించకపోవడం పోలీసుల పనితీరుకు నిదర్శనం.

నిరంతర గస్తీ అవసరం

- నిరంతరం పోలీసులు ప్రజల్లో ఉంటేనే నేరాలకు, చోరీలకు కళ్లెం వేయవచ్చు.
- నగరంలోని ప్రధాన రహదారులతో పాటు శివారు, నిర్మానుష్య ప్రాంతాలు, ఇతర సమస్యాత్మక కాలనీలపై దృష్టి పెట్టి బ్లూ కోల్ట్స్, క్యూఆర్టీ సిబ్బంది పెట్రోలింగ్ చేయాలని నగరవాసులు కోరుతున్నారు.
- స్టేషన్లు వదిలి రోడ్లపైకి వచ్చి శాంతిభద్రతలు, ట్రాఫిక్ నిర్వహణలో భాగం కావాలని ఓ రిటైర్డ్ పోలీసు అధికారి అభిప్రాయపడ్డారు.
- డీఎస్పీ స్థాయి అధికారి నుంచి కానిస్టేబుల్ వరకు గస్తీ విధులు పకడ్బందీగా చేస్తూ ఆకస్మిక తనిఖీలు చేపడితే ఫలితాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.
- నేర చరిత్ర ఉన్నవారి పట్ల ముఖ్యంగా దొంగలు, దోపిడీదారులు, జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ముఠాలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలి.
- రౌడీషీటర్లపై నిఘాతో పాటు కఠినంగా ఉంటేనే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

జిల్లాలో ఏడాదిన్నరగా నమోదైన చోరీల వివరాలు...

నేరాలు	2023	2024 మే వరకు
దోపిడీలు	08	05
పగటి దొంగతనాలు	180	96
రాత్రి దొంగతనాలు	167	89
సాధారణ దొంగతనాలు	487	289
అపహరణకు గురైన సొత్తు (రూ.కోట్లలో)	9.84	4.79



వాహన దొంగతనాలు...

సంవత్సరం	నమోదైన కేసులు	రికవరీ చేసిన వాహనాలు
2023	163	36
2024 మే వరకు	146	33





సైబర్ మోసాలు

సంవత్సరం	నమోదైన కేసులు
2023	346
2024 మే వరకు	251



కర్నూలు రాజ్‌విహార్ సెంటర్‌లో జాతీయ జెండాతో క్రీడాభిమానుల సంబరాలు

జయహో..

క్రీడాభిమానుల హృదయాలు ఉప్పొంగాయి.. జయహో భారత్ నినాదం మిన్నంటింది.. త్రివర్ణ పతాకం రెపరెపలాడింది.. నరాలు తెగే ఉత్కంఠ పోరులో భారత్ క్రికెట్ జట్టు జయకేతనం ఎగురవేసింది. టీ–20 వరల్డ్ కప్‌లో దక్షిణాఫ్రికాపై గెలిచి విశ్వవిజేతగా నిలిచింది. పెల్లుబికిన ఉత్సాహంతో యువకులు రోడ్ల పైకి వచ్చి సంబరాలు జరుపుకున్నారు. కేకులు కట్ చేసి, బాణాసంచా కాల్చి సందడి చేశారు. కర్నూలు రాజ్ విహార్ సెంటర్‌లో శనివారం అర్ధరాత్రి పండుగ వాతావరణం నెలకొంది. టీమిండియాకు జేజేలు చెబుతూ యువత ఆనందాన్ని పంచుకుంది.

– ఫొటోలు: జమ్మన్న, కర్నూలు సిటీ



బాణా సంచా కాల్చుతూ..



యువకుల కోలాహలం..



అంతటా ఆనందం..

లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం



జాతీయ లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు

- జిల్లా జడ్జి శ్రీనివాసరావు

కర్నూలు (లీగల్): కక్షిదారులకు సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్ చట్టం తెచ్చారని, దానిని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.శ్రీనివాసరావు అన్నారు. శనివారం జాతీయ లోక్ అదాలత్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని న్యాయ స్థానాల్లో జాతీయ లోక్ అదాలత్ ఏర్పాటు చేసి కేసుల పరిష్కారం చేస్తున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాద కేసుల్లో బాధితులకు సత్వరం నష్టపరిహారం అందుతుందని, ఆ నష్టపరిహారాన్ని సరైన విధంగా ఉపయోగించుకోవాలన్నారు. న్యాయ స్థానాల్లో కేసుల పరిష్కారానికి ఎక్కువ సమయం పడుతున్నందున లోక్‌అదాలత్ ద్వారా వీలైనన్ని కేసులు పరిష్కారం జరుగుతున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో పరిష్కారం జరిగి కేసులకు అప్పీళ్లు ఉండవని, లోక్ అదాలత్‌దే తుది తీర్పు అన్నారు. ఫ్యామిలీ కోర్టు జడ్జి ప్రతిభా దేవి కక్షిదారులు ఇష్టపూర్వకంగా రాజీపడితేనే కేసులు పరిష్కారమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి పి.పాండురంగారెడ్డి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీఎల్‌వి శేషాద్రి, సబ్ జడ్జీలు మల్లీశ్వరి, దివాకర్, జూనియర్ సివిల్ జడ్జిలు టి.జ్యోత్స్న దేవి, ఎం.సరోజినమ్మ, వందన, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.కృష్ణమూర్తి, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా జడ్జిని కలసిన కలెక్టర్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావును శనివారం జిల్లా కోర్టులో కొత్త కలెక్టర్ పి.రంజిత్ బాషా మర్యాదపూర్వకంగా కలసి బొకే ఇచ్చారు. జిల్లాకు వచ్చిన కొత్త కలెక్టర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలవడం సంప్రదాయం.

1,139 కేసులు పరిష్కారం

జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1,139 కేసులు పరిష్కారం చేశారు. కర్నూలులో 288 కేసులు, ఆదోనిలో 78, ఆళ్లగడ్డలో 77, నంద్యాలలో 205, ఆలూరులో 31, ఆత్మకూరులో 44, బనగానపల్లెలో 31, డోన్‌లో 122, కోయిలకుంట్లలో 67, నందికొట్కూరులో 39, పత్తికొండలో 79, ఎమ్మిగనూరులో 52 కేసులు పరిష్కారం చేశారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి



కలెక్టర్ రంజిత్‌బాషా, జేసీ మౌర్య

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో జూలై 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. శనివారం విజయవాడ నుంచి సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితులను కలెక్టర్ సీఎస్‌కు వివరించారు. పింఛన్ల పంపిణీ కోసం రూ.167 కోట్ల నగదును సిద్ధంగా ఉంచామన్నారు. పింఛన్ నగదుతోపాటు ముఖ్యమంత్రి లేఖను కూడా లబ్ధిదారులకు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, ఎల్‌డీఎం రామచంద్రరావు పాల్గొన్నారు.

2, 3 తేదీల్లో కౌన్సెలింగ్

పాణ్యం: ఉమ్మడి జిల్లాలోని బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 6, 7, 8, 9 తరగతుల్లో సీట్లు భర్తీ చేసేందుకు జూలై 2, 3 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కన్వీనర్ ఫ్లోరమ్మ తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని విద్యార్థులకు ఈనెల 20, 21వ తేదీల్లో పరీక్ష నిర్వహించామన్నారు. ఫలితాల ఆధారంగా మెరిట్ విద్యార్థులకు పాణ్యం మండలం నెరవాడ మెట్ట ఉన్న బీసీ బాలిక పాఠశాల, జూనియర్ కళాశాలలో కౌన్సెలింగ్ ద్వారా సీట్లు కేటాయిస్తున్నట్లు ఆమె తెలిపారు. బాలురకు 2న, బాలికలకు 3న కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

వెబ్‌సైట్లలో మెరిట్ లిస్ట్

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ, జనరల్ హాస్పిటల్స్, ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలకు సంబంధించిన 30 కేటగిరీల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు అభ్యర్థుల మెరిట్ లిస్ట్ కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రభుత్వ వెబ్‌సైట్‌లలో ఉంచినట్లు కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వారి మెరిట్ వివరాలను సరిచూసుకుని అభ్యంతరాలు ఉంటే జూలై ఒకటి నుంచి 5వ తేదీ సాయంత్రం 5 గంటలోపు కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా సమర్పించాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో పంపిన గ్రీవెన్స్, అభ్యంతరాలు స్వీకరించబోమని తెలిపారు.

క్లుప్తంగా

మహిళ ఆత్మహత్య

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని ఇటిక్యాలకు చెందిన ఓ వివాహిత శనివారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మంగలి రాంపుల్లమ్మ (38)కు మూడు వారాల క్రితం పాము కాటుకు గురైంది. చికిత్స చేయించుకున్నా ఆరోగ్యం సరిగా ఉండేది కాదు. దీనికి తోడు భర్త లక్ష్మీనారాయణ మద్యానికి బానిస కావడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. కొద్ది సేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్ఐ గోవింద నాయక్ తెలిపారు.

బాలుడిపై పిచ్చి కుక్క దాడి


గాయపడిన ఫారాహారూన్

హొళగుంద: మండల కేంద్రమైన హొళగుందలో ఈబీసీ కాలనీకి చెందిన ఫారా హారూన్ అనే మూడున్నరేళ్ల బాలుడిపై శనివారం పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయ పరిచింది. ఇంటి వద్ద ఆడుకుంటున్న బాలుడిపై ఉన్నట్టుండి పిచ్చికుక్క దాడి చేయడంతో తల, వీపు, చేతులకు గాయాలయ్యాయి. వెంటనే కుటుంబసభ్యులు బాలుడిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా అక్కడ డాక్టర్ బిందుమాధవి రెబీస్, టీటీ ఇంజెక్షన్లు వేశారు. మెరుగైన చికిత్స కోసం ఆదోనికి రెఫర్ చేశారు.

'రైతు సేవా కేంద్రాలు'గా మార్పు

- ఆర్‌బీకే వ్యవస్థ పేర్లను సమూలంగా మార్పు చేసిన కూటమి ప్రభుత్వం

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నెలకొల్పిన డాక్టర్ వైఎస్ఆర్ రైతుభరోసా కేంద్రాల పేర్లను టీడీపీ కూటమి ప్రభుత్వం సమూలంగా మార్పు చేసింది. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు ద్వారా వ్యవసాయ అనుబంధ శాఖల సేవలన్నీ గ్రామస్థాయిలోనే రైతులకు అందుతున్నాయి. ఆర్‌బీకే వ్యవస్థ జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంది. వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాలను ఇక నుంచి రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేశారు. ఆర్‌బీకే/డిజిటల్ కియోస్క్/ సాఫ్ట్‌వేర్‌లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో, నవరత్నాలు, ఆర్‌బీకే లోగోను వెంటనే తొలగించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లా, మండల, ఆర్‌బీకే స్థాయిలో ఉన్న వ్యవసాయ సలహా మండళ్లను రద్దు చేసింది. ఆర్‌బీకే చానల్/ స్టూడియో పేరు పాడిపంటలు చానల్/స్టూడియోగా మార్పు చేసింది. డాక్టర్ వైఎస్ఆర్ రైతు భరోసా మ్యాగజైన్ పేరును పాడిపంటల మ్యాగజైన్‌గా మార్పు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు అనుగుణంగా జిల్లా అధికారులు మార్పులకు చర్యలు చేపట్టారు.

మసకబారుతున్న చిన్నారి చూపు!

- చిన్నపిల్లల్లో కంటి సమస్యలు
- జిల్లాలో 4,351 పాఠశాలల్లో 6,73,728 మందికి కంటి పరీక్షలు
- అందులో 57,328 మంది పిల్లలకు దృష్టి లోపాలు
- 14,528 మందికి కంటి అద్దాల పంపిణీ
- వైద్యుల వద్దకు వస్తున్న వారిలో నాలుగు శాతం మంది చిన్నారులకు దృష్టి లోపాలు
- తదేకంగా సెల్‌ఫోన్, కంప్యూటర్లు చూడటం, పోషకాహార లోపం కారణం


విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం


కంటి వెలుగు కార్యక్రమంలో ఇచ్చిన కంటి అద్దాలతో విద్యార్థినులు

కర్నూలు(హాస్పిటల్): పాఠశాల, కళాశాలల్లో 20 ఏళ్ల క్రితం తరగతికి ఒకరో ఇద్దరికో కళ్లద్దాలు ఉండేవి. కానీ ఇప్పుడు దాదాపు 60 నుంచి 70 శాతం మంది పిల్లలకు కళ్లద్దాలు వచ్చాయి. ప్రైవేటు విద్యాసంస్థల్లో దాదాపుగా అందరు విద్యార్థులు కళ్లద్దాలతో కనిపిస్తున్నారు. మూడేళ్లకే పాఠశాలలకు పంపించడం, పోషకాహారం ఇవ్వకపోవడం, వంశపారంపర్యం తదితర కారణాలతో బాల్యం నుంచే చూపు మసకబారుతోంది. కర్నూలులోని ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రికి ప్రతిరోజూ 300 నుంచి 400 మంది వరకు కంటి చికిత్స కోసం వస్తున్నారు. అందులో నాలుగు శాతం మంది పిల్లలే ఉంటున్నారు. గత ఐదురోజుల్లో 1,609 మంది ఓపీ చికిత్సకు రాగా అందులో 64 మంది పిల్లలున్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గత మూడేళ్లుగా పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో 4,351 పాఠశాలల్లో 6,73,728 మంది పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 57,328 మంది పిల్లలకు దృష్టి లోపాలు ఉన్నట్లు తేలింది. ఇందులో దూరదృష్టిలోపం ఉండటంతో 14,528 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. మిగిలిన వారిలో ఇతర కంటి సమస్యలు ఉన్నాయి. ఈ లెక్కలు కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన వైద్యపరీక్షలు మాత్రమే. ప్రైవేటు పాఠశాలల్లోనూ ఇలాంటి పిల్లల సంఖ్య రెట్టింపుగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేటు పాఠశాలల్లోనే దృష్టిలోపం ఉన్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటోందని వైద్యులు చెబుతున్నారు.

పిల్లల్లో దృష్టి లోపానికి కారణాలు

పిల్లల్లో విటమిన్-ఏ లోపం వల్ల రేచీకటి, గ్లకోమా, జీరాప్తాల్మియా వంటి కంటి జబ్బులు వస్తున్నాయి. పోషకాహారలోపం కారణంగా పిల్లల్లో ఈ రకమైన విటమిన్ లోపిస్తోంది. మరికొంత మందికి పుట్టుకతోనే కంటి జబ్బులు వస్తున్నాయి. దీనికి జన్యుపరమైన కారణాలు, మేనరికపు వివాహాలు, గర్భంతో తల్లి తీసుకునే కొన్ని రకాలైన మందుల వల్ల ఇది ఏర్పడుతోంది. మేనరికం వల్ల రెటినైసిస్ పిగ్మెంటోజా అనే వ్యాధి పిల్లల్లో వస్తోంది. ఆర్‌వోపీ అనే వ్యాధి ప్రీమెచ్యూర్ పిల్లల్లో వస్తోంది. ఇలాంటి వ్యాధులను సకాలంలో గుర్తించేందుకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంట్రవెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు

సామాజిక, ఆర్థిక ఇబ్బందులూ కారణం

సామాజిక, ఆర్థిక ఇబ్బందుల వల్లే పిల్లలు పోషకాహారానికి దూరమై వారు దృష్టిలోపాలకు గురవుతున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. వీరిని ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన వైద్యం అందిస్తే దృష్టి లోపానికి గురిగాకుండా కాపాడుకోవచ్చు. ఈ ఉద్దేశంతోనే గత ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం కింద పాఠశాలల్లో చదివే 6 నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించింది. దృష్టి లోపాలతో బాధపడే పిల్లలను ఉపాధ్యాయులే గుర్తించి, వారికి పరీక్షలు చేయించింది.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

- కళ్లను రోజూ చల్లని మంచినీటితో కడగాలి
- కంటికి సుర్మా, కాటుక వంటివి వాడకపోవడమే మేలు
- దుమ్ము, పొగ, ప్రకాశవంతమైన కాంతివైపు కళ్లను నేరుగా తెరిచి చూడరాదు.
- పుస్తకాలు చదివే సమయంలో కంటికి అడుగున్నర దూరంలో 45–70 డిగ్రీల వంపులో పెట్టుకుని చదవాలి. తగినంత వెలుతురులోనే చదవాలి.
- రైళ్లు, బస్సుల్లో చదవకూడదు. పడుకుని అస్సలు చదవరాదు.
- చదివే సమయంలో, కంప్యూటర్, సెల్‌ఫోన్, ట్యాబ్ చూస్తున్నప్పుడు ప్రతి 15నిమిషాలకు ఒకసారి కళ్లకు విధిగా విరామం ఇవ్వాలి.
- దృష్టిలోపం ఉంటే కళ్లజోడు వాడటం తప్పనిసరి.

దృష్టిలోపాలకు అనేక కారణాలు



పిల్లల్లో వచ్చే దృష్టిలోపాలకు అనేక కారణాలు ఉన్నాయి. ఇందులో అలర్జిక్ కంజెంటివైటిస్ సమస్య ఒకటి. పార్థీనియం మొక్క విదిల్చే దుమ్ము కారణంగా ఈ సమస్య వస్తుంది. ఆహారంలో మార్పులతో వ్యాధినిరోధక శక్తి తగ్గి చూపు తగ్గుతుంది. ఈ సమస్య ఉన్న వారిలో కళ్లు ఎర్రగా మారడం, దురద, కళ్ల నుంచి నీళ్లు కారడం జరుగుతుంది. సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే నల్లగుడ్డుపైకి ఎర్రదనం పాకి చూపు తగ్గే ప్రమాదం ఉంది. దీంతో పాటు రిఫ్రాక్టివ్ ఎర్రర్స్(హ్రస్వదృష్టి) కూడా ఒకటి. ఇది వంశపారంపర్యంగా కొందరికి, అతి చిన్న వయస్సులో పిల్లలను పాఠశాలకు పంపడం, సెల్‌ఫోన్ అతి దగ్గరగా ఎక్కువసేపు చూడటం వల్ల వస్తుంది. దీనిని అధిగమించాలంటే చిన్నతనంలోనే పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించాలి. విటమిన్ల లోపం లేకుండా పోషకాలున్న ఆహారం ఇవ్వాలి.

–డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, ప్రాంతీయ ప్రభుత్వ కంటి వైద్యశాల, కర్నూలు

సెల్‌ఫోన్ ఇవ్వడం తగ్గించాలి



ఇటీవల కాలంలో పిల్లలు సెల్‌ఫోన్, కంప్యూటర్, టీవీ స్క్రీన్ చూసే సమయం పెరిగింది. ఈ కారణంగా వారి కళ్లపై ఒత్తిడి పెరిగి దూరదృష్టి సమస్య వచ్చి చిన్నతనంలోనే కంటి అద్దాలు వస్తున్నాయి. దీనికితోడు మారుతున్న జీవనశైలి, ఆరుబయట ఆటలు ఆడకపోవడం, విటమిన్-ఏ లోపం వల్ల కంటి జబ్బులు వస్తున్నాయి. గతంలో కంటే ఇప్పుడు పిల్లల తల్లిదండ్రుల్లో కంటి జబ్బులపై అవగాహన పెరిగింది. పిల్లలు ఏదైనా ఇబ్బంది పడుతుంటే వెంటనే అనుమానం పడి వైద్యులను సంప్రదిస్తున్నారు. ఈ మేరకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స చేయించడం వల్ల ఎక్కువ మంది పిల్లలు కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు కనిపిస్తోంది. కంటి సమస్యలు పోవాలంటే పిల్లలకు సెల్‌ఫోన్ ఇవ్వడాన్ని తగ్గించాలి. కంప్యూటర్, టీవీ చూడటం తగ్గించాలి. ఆరుబయట ఆటలు ఆడేందుకు అవకాశం కల్పించి ఆ మేరకు ప్రోత్సహించాలి.

–డాక్టర్ ఎం. మల్లికార్జున, అసోసియేట్ ప్రొఫెసర్, పీడియాట్రిక్స్, జీజీహెచ్, కర్నూలు

రోడ్డు ప్రమాదంలో గుత్తి వాసి దుర్మరణం


మృతి చెందిన ధనుంజయ

ప్యాపిలి: వెంగళాంపల్లి–వెంకటాంపల్లి మార్గంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం జిల్లా గుత్తి వాసి దుర్మరణం చెందాడు. గుత్తికి చెందిన ధనుంజయ (30), పామిడికి చెందిన శివయ్య బైక్‌పై బేతంచెర్ల మండలంలోని మద్దిలేటి స్వామి దర్శనానికి వెళ్లారు. దర్శనం అనంతరం తిరుగు వెళ్తుండగా వెంగళాంపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ధనుంజయ అక్కడికక్కడే మృతి చెందాడు. శివయ్యకు కాలు విరగడంతో చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు ధనుంజయకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- ఐదుగురికి గాయాలు


ప్రమాదస్థలంలో బోల్తాపడిన బొలేరో

మంత్రాలయం: మండల పరిధిలోని కల్లుదేవకుంట గ్రామ సమీపంలో శనివారం వేకువ జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఐదుగురికి గాయాలయ్యాయి. బొలేరో కారు, డీసీఎమ్ లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై కర్ణాటకలోని టుంకూరు జిల్లా శిరా గ్రామానికి చెందిన డ్రైవర్ హనుమంతురాజు, రమ్య, శృతి, చరణ్ బొలేరో కారులో వస్తున్నారు. బొలేర కారు, డీసీఎమ్ లారీ ఎదురెదురుగా ఢీకొనడంతో కారులో ఉన్నవారితో సహా లారీ డ్రైవర్ అవినాష్(లాతురు జిల్లా, హంప గ్రామం, మహారాష్ట్ర), క్లీనర్ గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ గోపీనాథ్ క్షతగాత్రులను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ హనుమంతు రాజుతో పాటు భక్తులు రమ్య, చరణ్, శృతి చికిత్స నిమిత్తం బెంగళూరుకు వెళ్లారు. గాయపడిన లారీ డ్రైవర్, క్లీనర్‌ను కర్నూలు ఆసుపత్రికి తరలించారు. బెంగళూరులో చికిత్స పొందుతున్న కారు డ్రైవర్ హనుమంతరాజు(28) చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు.

1 నుంచి పీజీ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పీజీ –4 వ సెమిస్టర్ పరీక్షలు జూలై 1వ తేదీ నుంచి 22 వరకు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ఆచార్య వెంకట సుందరానంద్ పుచ్చ తెలిపారు. వర్సిటీ కళాశాలతో పాటు ఐదు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రెగ్యులర్ 468, సప్లిమెంటరీ 103 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. రాయలసీమ విశ్వ విద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పరీక్షలు జూలై 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బీటెక్ 2,4,6 సెమిస్టర్ రెగ్యులర్ 505, సప్లిమెంటరీ 590 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు.

వార్డు సచివాలయంలో పింఛన్ డబ్బు చోరీ

- సర్టిఫికెట్‌తో వచ్చి రూ.50 వేలు దొంగలించిన వైనం



27వ వార్డు సచివాలయం

ఆదోని అర్బన్: డమ్ అండ్ డెఫ్ సర్టిఫికెట్‌తో వచ్చి రూ.50 వేలు నగదును దొంగలించిన ఘటన శనివారం ఆదోని పట్టణం 27వ వార్డు వార్డు సచివాలయంలో చోటు చేసుకుంది. సచివాలయ అడ్మిన్ రవికుమార్ తెలిపిన వివరాల మేరకు.. జూలై 1వ తేదీన పింఛన్ పంపిణీ చేసేందుకు బ్యాంకు నుంచి రూ.17 లక్షలు డ్రా చేసుకొని వార్డు సచివాలయంలో సిబ్బంది లెక్కకడుతున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఓ వ్యక్తి డమ్ అండ్ డెఫ్ సర్టిఫికెట్‌తో సచివాలయంలోకి వచ్చాడు. టేబుల్‌పై డబ్బు లెక్కిస్తుండగా సిబ్బంది వద్దకు వచ్చి సర్టిఫికెట్‌ను డబ్బు ఉన్న టేబుల్‌పై పెట్టాడు. టేబుల్‌పై పేపర్ పెట్టింది చూడకుండా.. బయటకు వెళ్లిపోవాలని చెప్పగా.. ఆయన టేబుల్‌పై పెట్టిన పేపర్‌తో పాటు రూ.50 వేలు నగదును ఎత్తుకెళ్లినట్లు సచివాలయ అడ్మిన్ రవికుమార్ తెలిపారు. డబ్బు లెక్కింపులో తేడా రావడంతో సీసీ కెమెరాలను పరిశీలించగా ఆ వ్యక్తి దొంగలించారని తెలుసుకుని, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. వార్డు సచివాలయ సిబ్బంది ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నామని త్రీ టౌన్ సీఐ నరసింహరాజు తెలిపారు.

మహానందిలో చిత్తూరు జిల్లా భక్తుడు మృతి

- సుపథ మండపంలో నిద్రిస్తూ అనంతలోకాలకు
- సంప్రోక్షణ జలంతో మండపాల్లో శుద్ధి పూజలు


సంప్రోక్షణ పూజలు చేస్తున్న పండితులు

మహానంది: చిత్తూరు జిల్లా వెలిగల్లుకు చెందిన చేరుపాట్ల ముత్యాలరెడ్డి(55) అనే భక్తుడు శనివారం మహానంది ఆలయ ఆవరణలో మృతి చెందారు. కొద్దిరోజులు క్రితం ఈయన మహానంది ఆలయ పరిసరాల్లోనే ఉంటున్నాడు. ఆలయం ముందు ఉన్న సుపథ మండపంలో సేదతీరుతున్న ఆయన నిద్రలోనే కన్నుమూశాడు. శనివారం ఉదయం విధులకు వచ్చిన ఆలయ ఏఈఓ ఓంకారం వేంకటేశ్వరుడు విషయం తెలుసుకుని ఆధార్‌కార్డు ద్వారా వివరాలు సేకరించి ముత్యాలరెడ్డి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రైవేటు అంబులెన్స్ ద్వారా మృతదేహాన్ని తరలించారు. ఇదిలా ఉండగా ఆలయ సంప్రదాయం ప్రకారం వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఆంజనేయశర్మ, హనుమంతుశర్మ, ఆలయ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో సుపథ మండపాన్ని సంప్రోక్షణ జలంతో శుద్ధి పూజలు నిర్వహించారు.

విద్యార్థి సంఘం నాయకుల హల్‌చల్

- డోన్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గదిలో ధర్నా
- పోలీసులకు ఫిర్యాదు చేసిన పాఠశాల సిబ్బంది
- ఏఐఎస్ఎఫ్ నాయకులపై కేసు నమోదు



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నేతలు


ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన పాఠశాల సిబ్బంది

డోన్: పట్టణ శివారులో గుత్తిరోడ్డులోని మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో శనివారం ఏఐఎస్ఎఫ్ నాయకులు హల్‌చల్ చేశారు. బాలికల పాఠశాలలోకి అనుమతి లేకుండా ప్రవేశించడంతో పాటు ఏకంగా ప్రిన్సిపాల్ గదిలోకి చొచ్చుకెళ్లి ధర్నా చేపట్టడంపై విమర్శలకు దారితీసింది. రెండు రోజుల క్రితం పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు అదృశ్యం కావడం, అదే రోజు సాయంత్రం కర్నూలులో వారి ఆచూకీ తెలియడంతో పాఠశాలకు చేర్చారు. ఈ విషయం తెలుసుకున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు పాఠశాల వద్దకు చేరుకుని పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంతోనే విద్యార్థులకు రక్షణ లేదంటూ ఆందోళనకు దిగారు. అలాగే ప్రిన్సిపాల్ వసుంధర దేవి గదిలోకి చొచ్చుకెళ్లి ధర్నా చేపట్టారు. దీంతో ఏఐఎస్ఎఫ్ నాయకులు అక్రమంగా చొరబడిని తమను భయభ్రాంతులకు గురిచేశారని పాఠశాల సిబ్బంది పోలీసుస్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సూర్యప్రతాప్, నాయకులు మనోజ్, శశిధర్‌రెడ్డి, ధనుష్, ధర్మతేజను అదుపులోకి తీసుకుని న్యూసెన్స్ కేసు నమోదు చేశారు. కాగా వారిని స్టేషన్ బెయిల్‌పై వదిలేశారు. గత ప్రభుత్వం రూ.8కోట్లతో ప్రతిష్టాత్మకంగా బాలికల గురుకుల పాఠశాల నిర్మించి, ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలను చేపట్టింది. 5 నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదివే అవకాశం ఉండటంతో ప్రవేశాలకు పోటీ పెరిగింది. రాజకీయ నేతల ఒత్తిళ్లతో అధిక సంఖ్యలో అడ్మిషన్లు ఇవ్వాల్సి రావడం, వారికి వసతి కల్పించలేక పోతున్నామని పాఠశాల సిబ్బంది చెబుతున్నారు. కొన్ని పనులు నిర్మాణంలో ఉండటం, ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులపై పర్యవేక్షణ కష్టంగా మారిందని వాపోతున్నారు. సెక్యూరిటీ గార్డుల నియామకం జరగకపోవడంతో విద్యార్థినులకు రక్షణ కల్పించడం తమకు తలకు మించిన భారంగా మారిందన్నారు. కొత్తగా పాఠశాలలో చేరిన విద్యార్థులు ఇంటి మీద బెంగతో తమ కళ్లుగప్పి పాఠశాల నుంచి వెళ్లే ప్రయత్నం చేస్తే విద్యార్థి సంఘాలు తమను బాధ్యులనుచేసి దుర్భాషలాడం తగదన్నారు. మరోసారి ఇలాంటివి జరగకుండా పోలీసులు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు.